సాక్షి తిరుపతి

మంగళవారం । 9 । జనవరి । 2024



పక్కాగా భూ లెక్క

జిల్లాలో భూ సర్వే పకడ్బందీగా సాగుతోంది. ఇప్పటికే రెండు విడతలు పూర్తయ్యింది. మూడో విడత చివరి దశకు చేరింది. - 8లో



అన్ని పథకాలు అమలు చేయాలి

సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధికారులను ఆదేశించారు. - 8లో



కమ్మేసిన పొగమంచు

తిరుమలలో సోమవారం దట్టమైన పొగమంచు కమ్మేసింది. ఘాట్ రోడ్లలో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. - తిరుమల

న్యూస్‌రీల్

గడువులోగా అర్జీలకు పరిష్కారం



స్పందనలో అర్జీదారలతో మాట్లాడుతున్న అధికారులు

తిరుపతి అర్బన్: స్పందన అర్జీలకు గడువులోగా పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్ సిబ్బందిని ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కారించారు. మరికొన్ని నిర్దిష్ట గడువులోగా పరిష్కరించనున్నట్టు హామీ ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 201 వినతులు అందగా అందులో రెవెన్యూశాఖకు సంబంధించి 169 అర్జీలు ఉన్నట్టు వెల్లడించారు. ఆయన వెంట డీఆర్వో పెంచల కిషోర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కేవీ.శ్రీనివాస్, భవానీశంకర్, భాస్కరనాయుడు, కలెక్టరేట్ ఏఓ జయరాములు పాల్గొన్నారు.

18 నుంచి జాతీయ వర్క్‌షాప్



హాజరైన జేసీ, డీఆర్వో తదితరులు

తిరుపతి అర్బన్: తిరుపతి శిల్పారామం వేదికగా ఈనెల 18 నుంచి 20వ తేదీ వరకు జాతీయ వర్క్‌షాపు నిర్వహించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్.జవహర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం తాడేపల్లె నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, జేసీలతోపాటు అధికారులతో సమీక్షించారు. తిరుపతి కలెక్టరేట్ నుంచి జేసీ శుభం భన్సల్, పంచాయతీ రాజ్ జాయింట్ కలెక్టర్ జనార్దన్‌రెడ్డి, డీఆర్వో పెంచలకిషోర్, డీపీవో రాజశేఖర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి తదితరులు పాల్గొన్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్డీవో నిషాంత్ రెడ్డి, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, అగ్నిమాపక జిల్లా అధికారి రమణయ్య పాల్గొన్నారు.

పలువురు ఎస్‌ఐల బదిలీ

చిత్తూరు అర్బన్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలోని 13 మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ పోలీసు శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు జిల్లా నుంచి రమణ, సురేంద్రబాబు, పద్మావతి, సుగుణ, దాసరాజు నాయక్‌ను అనంతపురం వీఆర్‌కు బదిలీచేశారు. అలాగే తిరుపతి జిల్లా నుంచి శ్రీనివాసులు, చలపతి, గిరిబాబు, వెంకటేశ్వర్లు, హే మాద్రి, మూర్తి, గౌరీశంకర్‌లను అనంతపురం, రామకృష్ణను చిత్తూరుకు బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

నెలాఖరులోపు టిడ్కో గృహాల అందజేత



గృహాలను పరిశీలిస్తున్న టిడ్కో చైర్మన్

సైదాపురం (వెంకటగిరి): లబ్ధిదారులకు ఈ నెలాఖరులోపు టిడ్కో గృహాలు అందజేస్తామని రాష్ట్ర టిడ్కో చైర్మన్ జమిళ్ల ప్రసన్నకుమార్ తెలిపారు. వెంకటగిరిలోని వైఎస్సార్ నగర్‌లో నూతనంగా నిర్మించిన టిడ్కో గృహాలను సోమవారం ఆయన పరిశీలించారు. జనవరి నెలాఖరున నెల్లూరు నగరంలోని గృహాలతో పాటు వెంకటగిరిలో ఉన్న 17,500 గృహాలను అందజేస్తామన్నారు. టిడ్కో సూపరిటెండెంట్ ఇంజినీరు జాన్‌సైమన్ రావు, ఈఈ ఉమాశంకర శాస్త్రి, డీఈ పార్థసారథి పాల్గొన్నారు.

నేటి నుంచి సంక్రాంతి సెలవులు

తిరుపతి అర్బన్: సంక్రాంతిని పురస్కరించుకుని మంగళవారం నుంచి ఈనెల 18వ తేదీ వరకు అన్ని యాజమాన్యాల పాఠశాలలకు సెలవులు ప్రకటిస్తున్నట్టు డీఈఓ వీ.శేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. తప్పకుండా నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 5 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 76,058 మంది స్వామివారిని దర్శించుకోగా 26,489 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.83 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది.

పల్లెకు ఆరోగ్య సిరి



చంద్రగిరి మండలం, చిన్నరామాపురంలోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్



దోర్నకంభాల వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది



వయసుడిగిన వారు జబ్బు చేస్తే దేవుడిపైనే భారం వేయాల్సి వచ్చేది. చేతిలో చిల్లిగవ్వ లేక.. బిడ్డలు పట్టించుకోక మరింత కుంగిపోయేవారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు పట్టణానికి వెళ్లితే జేబులకు చిల్లులు పడేవి. అక్కచెల్లెమ్మల వైద్యపరీక్షలకు ఖర్చు తడిసిమోపుడయ్యేది. ఇలాంటి పరిస్థితిని పూర్తిగా మార్చేశారు.. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి. వైద్య సేవలను పల్లెచెంతకే తెచ్చి రికార్డు సృష్టించారు. పీహెచ్‌సీ డాక్టర్లను ఇళ్ల వద్దే వచ్చి రోగులను పరీక్షించే విధానానికి శ్రీకారం చుట్టారు. వైఎస్సార్ విలేజ్ హెల్త్‌క్లినిక్, ఫ్యామిలీ ఫిజీషియన్ లాంటి కొత్తకొత్త పథకాలకు పురుడుపోశారు. గడపవద్దే వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తూ వైద్య చరిత్రలో సరికొత్త అధ్యాయానికి తెరతీశారు. దీనిపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తిరుపతి రూరల్: ప్రభుత్వం గ్రామీణ ప్రజలకు వారి సొంతూరులోనే వైద్య చికిత్సలు, వైద్య పరీక్షలను అందుబాటులోకి తీసుకువస్తోంది. ప్రతి 2,500 జనాభాకు ఒక వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి హెల్త్ క్లినిక్‌కు రూ.20.30 లక్షలతో రూ.17.86 కోట్లతో మొత్తం 88 హెల్త్ క్లినిక్‌ను ఏర్పాటు చేస్తోంది. ఇందులో ఇప్పటివరకు 53 సెంటర్లలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చింది. జనవరి నెలఖారుకు మిగిలిన 23 భవనాలను కూడా పూర్తి చేయనున్నట్లు పంచాయతీరాజ్ డీఈ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

12 రకాల వైద్య సేవలు

గర్భిణులు, చిన్నారుల సంరక్షణ, నవజాతశిశు ఆరోగ్య సంరక్షణ, బాల్యం, కౌమారదశ ఆరోగ్య సంరక్షణ, కుటుంబ నియంత్రణ, గర్భనిరోధక సేవలు, ఇతర పునరుత్పత్తి ఆరోగ్య సంరక్షణ సేవలు, అంటువ్యాధుల నిర్వహణ, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలు, తీవ్రమైన సాధారణ అనారోగ్యాలు, చిన్న జబ్బులకు జనరల్ అవుట్ పేషెంట్ కేర్, వ్యాధుల స్క్రీనింగ్, నివారణ, నియంత్రణ, నిర్వహణ, సాధారణ ఆఫ్తాల్మిక్ (కంటి సమస్యలు), ఈఎంటీ సమస్యల కోసం జాగ్రత్తలు, ప్రాథమిక నోటి ఆరోగ్య సంరక్షణ, వృద్ధాప్య వ్యాధులకు చికిత్స, ఉపశమన ఆరోగ్య సంరక్షణ, కాలిన గాయాలకు, ప్రమాదాల్లో గాయపడిన (ట్రామా) వారికి అత్యవసర వైద్య సేవలు, మానసిక ఆరోగ్య వ్యాధుల స్క్రీనింగ్, ప్రాథమిక నిర్వహణ.

14 రకాల ప్రాథమిక పరీక్షలు

వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో వైద్య సేవలతో పాటు 14 రకాల ప్రాథమిక ఆరోగ్య పరీక్షలను ఉచితంగా అందించనున్నారు. హిమోగ్లోబిన్, గర్భవతులకు యూరిన్ పరీక్ష, ఇతర యూరిన్ టెస్టులు, బ్లడ్ షుగర్, మలేరియా, హెచ్‌ఐవీ, డెంగీ, కంటి పరీక్షలు, అయోడిన్ సాల్ట్ పరీక్షలు, వాటర్ టెస్టింగ్, హెపటైటిస్ బీ, ఫైలేరియా, ర్యాపిడ్ టెస్ట్, కఫం పరీక్షలు చేస్తారు. గర్భిణుల పౌష్టికాహారానికి సంబంధించి విలువైన సూచనలిస్తారు.

చంద్రగిరి నియోజకవర్గ జనాభా

మండలం	పురుషులు	మహిళలు	మొత్తం
చంద్రగిరి	28,334	28,952	57,286
పాకాల	28,025	28,642	56,667
చిన్నగొట్టిగల్లు	13,021	13,129	26,150
ఎర్రావారిపాళెం	14,123	13,888	28,011
తిరుపతి రూరల్	59,449	57,996	1,17,445
రామచంద్రాపురం	15,669	15,704	31,375
మొత్తం	1,70,274	1,69,960	3,40,234

మంజూరైన హెల్త్‌క్లినిక్‌లు

చంద్రగిరి 20	చిన్నగొట్టిగల్లు 8
పాకాల 11	రామచంద్రాపురం 10
తిరుపతి రూరల్ 29	ఎర్రావారిపాళెం 5
తిరుపతి అర్బన్ 5	మొత్తం 88

మంజూరైన నిధులు రూ.17,86,40,000

హెల్త్‌క్లినిక్‌ల వివరాలు

ప్రారంభంకానివి 01	పునాదుల దశ 01
పునాదులు పూర్తయినవి 03	రూఫ్ లెవల్ 04
చివరి దశలో ఉన్నవి 21	మౌల్డింగ్ 05
	అందుబాటులోకి వచ్చినవి 53

ఇబ్బందులు పడేవాళ్లం



మా ఊరు నుంచి కుప్పంబాదూరు పీహెచ్‌సీకి వెళ్లాలంటే రెండు బస్సులు మారాలి. చాలా ఇబ్బంది పడేవాళ్లం. డా.వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేయడం వల్ల పీహెచ్‌సీ డాక్టర్లు ఇంటివద్దకే వచ్చి వైద్యపరీక్షలు చేసి మందులు అందిస్తున్నారు. - సారథి, నెత్తకుప్పం

జగనన్న మేలు మరవలేం



వైద్యపరీక్షలు చేయించుకోవాలంటే 15 కిలోమీటర్ల దూరంలోని తిరుపతికి పరుగెత్తాల్సిందే. జగన్ సీఎం అయ్యాక రాష్ట్రంలో వైద్య విప్లవం వచ్చింది. ఇంటి వద్దే వైద్య సేవలు అందిస్తున్నారు. మాలాంటి పల్లె ప్రజలకు మెరుగైన వైద్యం గడప గడపకే వచ్చింది. - శేషాద్రి, పీవీపురం

వైఎస్సార్‌ను తలపించేలా..



నాకు 70 ఏళ్ల. ప్రభుత్వ వైద్యులు ఇంటికే వచ్చి వైద్యం అందించడం ఇంతవరకు ఎప్పుడూ చూడలేదు. వైద్య చరిత్రలో వైఎస్సార్ మాత్రమే అనితర సాధ్యుడు అనుకున్నాం. కానీ ఆయన బిడ్డ జగన్ తండ్రిని తలపించేలా వైద్య సేవలను మరింతగా ప్రజలకు చేర్చాడు. - సుబ్రమణ్యం, పాకాల

ఉచితంగా మందులు



వైఎస్సార్ గ్రామీణ విలేజ్ క్లినిక్‌లు అందుబాటులోకి వచ్చిన తర్వాత అలా నడుచుకుంటూ వచ్చి వైద్య పరీక్షలు చేసుకుంటున్నాం. ఉచితంగా మందులు అందిస్తున్నారు. చాలా ఉపయోగకరమైన సేవలను అందుబాటులోకి తీసుకువచ్చి సీఎం జగన్ దేశానికే ఆదర్శంగా నిలిచారు. - కృష్ణయ్య, భీమవరం

జగన్ దేవుడు స్వామి!



జగన్ దేవుడు స్వామి. మాలాంటి ముసలివాళ్లకు భారంగా మారిన వైద్యాన్ని ఇంటికే తీసుకువచ్చాడు. 4,15 రకాల పరీక్షలు చేస్తున్నారు. ప్రైవేటుగా రక్త పరీక్ష చేసుకోవాలంటే రూ.వెయ్యి దాకా అయ్యేది. ఇప్పుడు పైసా ఖర్చు లేకుండా వైద్యం అందిస్తున్నారు. - లక్ష్మమ్మ, చిన్నరామాపురం

• సడలని సంకల్పం..సమరోత్సాహం!



అదే సంకల్పం.. తరగని ఉత్సాహం.. మదిలో మెదలాడే నాటి జ్ఞాపకాల నుంచి పురుడు పోసిన నవరత్నాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతూ.. సమరోత్సాహంతో ముందుకు సాగుతున్నారు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి. ఆయన చేపట్టిన ప్రజాసంకల్ప పాదయాత్ర నేటితో ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా నాటి మధుర స్మృతులను ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రజలు నెమరు వేసుకుంటున్నారు. జిల్లాలో 29 రోజులు సాగిన పాదయాత్రకు జనం నీరాజనాలు పట్టారు. ఆయన చిందించిన చెమట చుక్కే నేటి అభివృద్ధికి చుక్కాని అయ్యిందని కొనియాడుతున్నారు. - తిరుపతి సిటీ

వైఎస్సార్ సీపీలోకి వలసల వెల్లువ

ఏర్పేడు: వైఎస్సార్‌సీపీలోకి వలసల జోరు పెరిగింది. ఏర్పేడు మండలం, మఠ్రిమండలో సోమవారం రాత్రి టీడీపీ, జనసేనకు చెందిన నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలోకి చేరారు. ఆయా పార్టీలకు చెందిన మునికృష్ణ, ఆనందయ్య, కుప్పయ్య, రమణయ్య, పాపయ్య, తిరుపాల్ తదితర 30 మంది నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి కండువాలు కప్పి, వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి కిషోర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, పార్టీ మండల అధ్యక్షుడు రమణయ్య యాదవ్, నాయకులు సుధీర్‌కుమార్, మస్తాన్, గోపీ రాయల్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

ఉద్యోగుల మేలుకోరి..
సంతోషం ఇంటికి చేరి!

- టీటీడీ ఉద్యోగులందరికీ ఇళ్ల పట్టాలు
- రిటైర్డ్ ఉద్యోగుల కలలూ సాకారం చేస్తాం
- ఇళ్ల పట్టాల పంపిణీలో టీటీడీ చైర్మన్ భూమన వెల్లడి



ఉద్యోగులకు ఇంటి పత్రాలు అందజేస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ధర్మారెడ్డి, జేఈఓలు

తిరుపతి (అలిపిరి): ఉద్యోగులకు మేలు చేయాలనే ఏకై క లక్ష్యంతో ముందుకెళుతున్నామని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. టీటీడీ ఉద్యోగులకు రెండో విడత ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం తిరుపతి మహతి ఆడిటోరియంలో పండుగ వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన టీటీడీ చైర్మన్ మాట్లాడుతూ నిస్వార్థంగా చేస్తున్న ఈ కార్యక్రమంపై కొంతమందితోపాటు కొన్ని మీడియా సంస్థలు ఆరోపణలకు దిగడం మంచిది కాదన్నారు. ఉద్యోగులకు మేలు చేయాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. 17 ఏళ్ల క్రితం తాను టీటీడీ చైర్మన్‌గా ఉన్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డిని కలిసి ఉద్యోగుల ఇళ్ల స్థలాల విషయమై చర్చించినట్టు తెలిపారు. అలాగే ఆయన తనముడు, ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని తాను సంప్రదించినప్పుడు ఆయన ఉద్యోగులందరికీ ఉచితంగా ఇంటి స్థలాలు ఇద్దామని చెప్పారన్నారు. అయితే ఇందులో ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో నామమాత్రపు ధరతో ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులందరికీ ఇంటి పట్టాలు మంజూరు చేయడానికి ముఖ్యమంత్రి అంగీకరించారన్నారు. మూడో విడతగా రిటైర్డ్ ఉద్యోగులు, మిగిలిన ఉద్యోగులందరికీ ఇంటిస్థలాలు ఇవ్వడం కోసం ఏర్పేడు మండలం, పాగాలి వద్ద 350 ఎకరాలు టీటీడీకి కేటాయించినట్టు తెలిపారు. ఇందుకోసం ధర్మకర్తల మండలి సమావేశంలో రూ.87.50 కోట్లు మంజూరు చేయించడంలో ఈవో ప్రత్యేక శ్రద్ధ వహించారన్నారు. తాను పేరు కోసం కాకుండా బాధ్యతతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డి మాట్లాడుతూ ఇళ్ల స్థలాలకు సంబంధించి ఉద్యోగులు ఎలాంటి అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఇది పూర్తిగా ప్రభుత్వ భూమి అని, టీటీడీ సొమ్ము చెల్లించి కొనుగోలు చేసి ఉద్యోగులకు అందిస్తోందని, కోర్టు కేసులు ఉండవని స్పష్టం చేశారు. ఏర్పేడు వద్ద ఈ నెలాఖరులోపు ప్రభుత్వం నుంచి భూమిని స్వాధీనం చేసుకుంటామన్నారు. జేఈవో వీరబ్రహ్మం మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒక్కసారిగా ఇన్ని వేల మంది ఉద్యోగులకు ఇంటిస్థలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ధర్మారెడ్డికే దక్కుతుందన్నారు. త్వరలో 4 వేల మందికి పైగా ఉద్యోగులకు, రిటైర్డ్ ఉద్యోగులకు ఇంటిస్థలాలు అందజేస్తామని చెప్పారు. అనంతరం చైర్మన్, ఈవో చేతులమీదుగా ఉద్యోగులకు ఇంటి స్థలం పత్రాలను పంపిణీ చేశారు. మొత్తం 1,703 మందికి రెండో విడతలో ఇంటిస్థలాలు అందించారు. జేఈవో సదాభార్గవి, సీవీఎస్‌వో నరసింహ కిషోర్, డీఎల్వో వీరరాజు, సీఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



హాజరైన ఉద్యోగులు

'స్వచ్ఛ'మైన సంబరాలు

తిరుపతి నగరం :స్వచ్ఛ తిరుపతికి ప్రజలు, సిబ్బంది కలిసికట్టుగా కృషి చేయాలని కమిషనర్ హరిత పిలుపునిచ్చారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో భాగంగా జాతీయ స్థాయిలో అవార్డు రావడంతో తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మొదటగా శానిటరీ సూపర్‌వైజర్లు సుమతి, చెంచెయ్యకు తినిపించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ 2023 కు జరిగిన పోటీలలో తిరుపతి జాతీయ స్థాయిలో అవార్డు పొందిందని, ఈనెల 11వ తేదీ ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో అవార్డు అందుకోవడం జరుగుతుందన్నారు. ఈ అవార్డు రావడానికి కృషి చేసిన ప్రజలకు, మున్సిపల్ కార్పొరేషన్ శానిటేషన్, ఇంజనీరింగ్ సిబ్బందికి, సహకరించిన కౌన్సిల్ సభ్యులకు ఈ సందర్భంగా కమిషనర్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్‌రెడ్డి, డీఈలు విజయకుమార్‌రెడ్డి, సంజీవ్‌కుమార్, రవీంద్రరెడ్డి, మహేష్, శ్రావణి, రాజు, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్రరెడ్డి, సెక్రటరీ రాధిక, ప్లానింగ్ అధికారులు శ్రీనివాసులురెడ్డి, బాలసుబ్రమణ్యం, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఏపీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ రాష్ట్ర అధ్యక్షుడిగా లక్ష్మీపతి



లక్ష్మీపతిని అభినందిస్తున్న సీసీఎఫ్ నాగేశ్వరరావు

తిరుపతి మంగళం: ఏపీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా తిరుపతి ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి ఎన్.లక్ష్మీపతి(ఎఫ్ఆర్వో) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలోని ఓ హోటల్లో ఆదివారం ఏపీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ రాష్ట్ర ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికైన ఎన్.లక్ష్మీపతి సోమవారం తిరుపతి కపిలతీర్థం సమీపంలోని సీసీఎఫ్ కార్యాలయంలో చీఫ్‌కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సీసీఫ్) నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా లక్ష్మీపతిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

267 ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

మదనపల్లె : అన్నమయ్య జిల్లాలోని మదనపల్లె ప్రభుత్వ వైద్యకళాశాల, ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో తాత్కాలిక, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 267 ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మెడికల్ కాలేజ్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్.ఎంవీ మురళీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో 13 కేటగిరీలకు 65 ఖాళీలు, ప్రభుత్వ జిల్లా జనరల్ ఆస్పత్రిలో 29 కేటగిరీలకు 202 పోస్టులు ఉన్నాయన్నారు. వీటికి సంబంధించి జనవరి 14వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు చిత్తూరు.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కేటగిరీ, అర్హత, ఇతర వివరాలు వెబ్‌సైట్‌లోనే ఉంచామన్నారు.

పక్కాగా భూ లెక్క

- జోరుగా భూముల రీ సర్వే
- ముగింపు దశకు చేరుకున్న మూడో విడత సర్వే
- నాలుగో విడత సర్వేకి సిద్ధమవుతున్న యంత్రాంగం



భూసర్వే చేస్తున్న అధికారులు

తిరుపతి అర్బన్: దశాబ్దాల తరబడి భూ సమస్యలకు పరిష్కారం లేకపోవడంతో ఊరూవాడలో వివాదాలు చోటుచేసుకుంటున్నాయి. పొలం గట్ల వద్ద, స్థలం సరిహద్దుల వద్ద, సర్వే నంబర్లు తప్పల తడకగా ఉండడంతో తగాదాలు కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వాలు వాటిని పరిష్కరించకపోవడంతో సమస్య తీవ్రమైంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి భూ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని నిశ్చయించారు. ఇందులో భాగంగా జగనన్న శాశ్వత భూ హక్కు.. భూరక్ష పథకానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలో ఇప్పటికే రెండు విడతల్లో భూ రీసర్వే పూర్తి కాగా ఇప్పుడు మూడో దశ తుది అంకానికి చేరింది. ఈ నెలాఖరులోగా నాల్గో విడత భూ రీసర్వేకి అధికారులు సమయాత్తమవుతున్నారు.

భూసర్వే ఇలా..

జిల్లాలోని 1,051 గ్రామాల్లో భూసర్వే చేపట్టాల్సి ఉంది. ముందుగా డ్రోన్ సర్వే చేసి ఎంత విస్తీర్ణంలో సర్వే చేయాల్సి ఉందనే విషయాన్ని తెలుసుకుంటారు. జిల్లాలో 15,40,351 ఎకరాల్లో సర్వే చేయాల్సి ఉండగా.. తొలి దశలో 74 గ్రామాల్లో 11,972 ఎకరాలు, రెండో దశలో 106 గ్రామాల్లో 27,998 ఎకరాల్లో సర్వే పూర్తి చేశారు. 15,552 మందికి భూహక్కు పత్రాలను అందించారు. సరిహద్దు రాళ్లను ఏర్పాటు చేశారు. మూడో దశలో 140 గ్రామాల్లో 1,31,401 ఎకరాల్లో సర్వే ముగింపు దశకు చేరింది. ఈనెల నుంచే 4వ దశ సర్వేను ప్రారంభించడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు.

సమస్యలు తగ్గుతాయి



భూముల రీసర్వేతో సమస్యలు తగ్గుతున్నాయి. ఎప్పుడో బ్రిటీష్ కాలంలో సర్వేలు చేపట్టారు. ఆ తర్వాత ఏ నాయకుడూ సర్వేలు నిర్వహించ లేదు. ఇప్పుడు భూసమస్యలకు చెక్ పెట్టడానికి ముఖ్యమంత్రి జగన్ భూముల సర్వేను చేపట్టడం సంతోషంగా ఉంది.

–ప్రభాకర్‌రెడ్డి,
రైతు, పల్లం గ్రామం, ఏర్పేడు మండలం

వేగవంతంగా సర్వే



తప్పులు లేకుండా భూముల సర్వేను వేగవంతం చేయిస్తున్నాం. మొదటి రెండు దశలకు సంబంధించి భూహక్కు పత్రాలు ఇవ్వడంతోపాటు సరిహద్దు రాళ్ల ఏర్పాటు చేయించాం. మూడో విడత సర్వే పూర్తికావస్తోంది. దశల వారీగా జిల్లాలో వందశాతం సర్వేను పూర్తిచేస్తాం. భూ సమస్యలు పరిష్కరిస్తాం.

– జయరాజ్, జిల్లా సర్వే విభాగం అధికారి

సంక్షేమ సారథి సీఎం జగన్



బసవరాజుకు స్వాగతం పలుకుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

నాయుడుపేట టౌన్: సంక్షేమ సారథి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని, ఆయన్ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఏపీ ఎస్సీ కమిషన్‌మాజీ సభ్యులు కే.బసవరాజు పిలుపునిచ్చారు. ఆయన కొంతమంది అనుచరులతో ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు చేపట్టిన పాదయాత్ర సోమవారం నాయుడుపేటకు చేరింది. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయ కులు పాదయాత్రకు సంఘీభావం తెలిపి బసవరాజు బృందానికి గోమతి సెంటర్ వద్ద ఘన స్వాగతం పలికారు. అనంతరం పూలమాలలు, శాలువలతో ఆత్మీయంగా సత్కరించారు. అనంతరం బసవరాజు విలేకరులతో మాట్లాడుతూ సీఎం జగనన్న సారథ్యంలో వచ్చే ఎన్నికల్లో 175కు 175 స్థానాలు గెలుపొందాలని కోరుతూ చేపట్టిన పాదయాత్ర నేటికి 900 కిలోమీటర్లు పూర్తయిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంపై చంద్రబాబుతో పాటు లోకేష్, పవన్‌కళ్యాణ్, బాలకృష్ణ తదితరులు అడ్డదిడ్డంగా విమర్శలు చేయడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు కే.జయరామయ్య, బీ.మల్లికార్జునరెడ్డి, చంద్రారెడ్డి, మెస్‌భాస్కర్‌రెడ్డి, డీ.రవి, పీ.రాహుల్, పీ.నాగార్జున, కే.అశోక్‌కుమార్, వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, వీరయ్య, బాబు తదితరులు ఉన్నారు.

10న తిరుపతిలో 'జన్ భాగీదారి'



స్పందనకు వచ్చిన అర్జీదారులతో మాట్లాడుతున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జన్ భాగీదారి కార్యక్రమాన్ని తిరుపతిలో ఈ నెల 10వ తేదీన పెద్ద ఎత్తున చేపట్టనున్నట్టు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత తెలిపారు. జన్ భాగీదారి నిర్వహణపై సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయవాడలో ఈ నెల 19వ తేదీన 120 అడుగుల ఎత్తుతో ఏర్పాటు చేస్తున్న బీఆర్ అంబేడ్కర్ 'సామాజిక న్యాయ మహా శిల్పం' విగ్రహావిష్కరణ ఉంటుందన్నారు. సామాజిక న్యాయ మహా శిల్పం ఆవిష్కరణకు మద్దతుగా ఈ నెల 10వ తేదీ తిరుపతిలోని అన్ని సచివాలయాల్లో అంబేడ్కర్ చిత్రపటాన్ని ఆవిష్కరించనున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా ఆమె అధికారులకు పలు సూచనలు చేశారు. అలాగే ×అంబేడ్కర్ నిర్దేశించిన సామాజిక న్యాయమార్గంలో నడుస్తానని.. నేను ప్రతిజ్ఞ చేస్తున్నాను.₹ అని సచివాలయాల వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై సంతకాలు పెట్టించాలని సూచించారు. తిరుపతిలోని అన్ని అంబేడ్కర్ విగ్రహాలను శుభ్రం చేసి, సుందరీకరణ పనులు చేపట్టాలన్నారు. సోషియల్ జస్టిస్ అవేర్ నెస్ తీసుకొచ్చేందుకు ఎస్సీ, ఎస్టీ వార్డుల్లో, వెనుకబడిన వార్డుల్లో కార్యక్రమాలు చేపట్టాలని, స్కూల్స్, కాలేజీల్లో క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించాలని కమిషనర్ హరిత అధికారులకు సూచించారు. అనంతరం డయల్ యువర్ కమిషనర్‌కు 18, స్పందనలో 25 వినతులు అందాయని, వీటిపై స్పందిస్తూ సకాలంలో ప్రజా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ ఫోన్ ద్వారా మాట్లాడుతూ 14వ వార్డులో పెండింగ్ పనులు పూర్తి చేయాలని, కేశవయానగుంటలో తారు రోడ్డు వేయాలని, హీరోహోండా షోరూమ్ వద్ద రబ్బరు స్పీడ్ బ్రేకర్లు వేయాలని కోరారు. డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, రెవెన్యూ ఆఫీసర్ సేతు మాదవ్, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్‌రెడ్డి, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ప్లానింగ్ అధికారులు శ్రీనివాసులురెడ్డి, బాలసుబ్రమణ్యం, కార్యదర్శి రాధిక తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ

చంద్రగిరి: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఉచితంగా కుట్టు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు యూనియన్ బ్యాంకు గ్రామీణ ఉపాధి సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10 తేదీ నుంచి 30 రోజుల పాటు మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. తెల్లరేషన్ కార్డు కలిగి తిరుపతి, చిత్తూరు జిల్లా గ్రామీణ ప్రాంతాలకు చెందిన 19–45 ఏళ్ల మధ్య వయస్సు కలిగి, కనీసం పదో తరగతి చదువుకున్న నిరుద్యోగ మహిళలు అర్హులన్నారు. శిక్షణ సమయంలో అభ్యర్థులకు ఉచిత భోజనం, రాను, పోను ఒకసారి బస్సు ఛార్జీలు ఇవ్వడంతోపాటు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. శిక్షణ తీసుకోదలచిన వారు ఆధార్‌కార్డు, రేషన్ కార్డు జెరాక్స్, 4 పాస్ పోర్టు సైజు ఫొటోలతో నేరుగా సంస్థ వద్దకు వచ్చి వారి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఒక్క బ్యాచ్‌కు 25–30 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ముందుగా నమోదు చేసుకున్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణాభివృద్ధి సంస్థ, ద్వారకా నగర్, కొత్తపేట, చంద్రగిరి, లేదా 79896 80587, 94949 51289, 63017 17672 నంబర్లను సంప్రదించాలని కోరారు.

టీటీడీ ఉద్యోగుల కల నెరవేరింది



టీటీడీ చైర్మన్ కరుణాకరరెడ్డికి జ్ఞాపిక అందజేసి, సన్మానిస్తున్న టీటీడీ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు, సభ్యులు

తిరుపతి(అలిపిరి): ఎన్నో ఏళ్ల నాటి టీటీడీ ఉద్యోగుల కల నెరవేరిందని, ఇందుకు సహకారం అందించి టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, టీటీడీ చైర్మన్ కరుణాకరరెడ్డికి టీటీడీ హౌసింగ్ సొసైటీ యూనియన్ అధ్యక్షుడు గంపల వెంకట రమణారెడ్డి సొసైటీ తరపున కృతజ్ఞతలు తెలిపారు. చరిత్రలో కనీవిని ఎరగని రీతిలో వేల మంది ఉద్యోగులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడం గర్వంగా ఉందని, ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేసిన కరుణాకరరెడ్డికి రాబోయే ఎన్నికల్లో సహకారం అందించి రుణం తీర్చుకుంటామని పేర్కొన్నారు. అనంతరం టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి జ్ఞాపిక అందజేసి, సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి గొల్కొండ వెంకటేశన్, కోశాధికారి ప్రసాద్‌రావు, టి.భాస్కర్, మునిరెడ్డి, వాసు తదితరులు పాల్గొన్నారు.

అన్ని పథకాలను పక్కాగా అమలు చేయాలి



కలెక్టరేట్ నుంచి హాజరైన జేసీ, ఇతర అధికారులు

తిరుపతి అర్బన్: ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలను పక్కాగా అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తాడేపల్లి నుంచి సీఎంఓ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య సంబంధిత కార్యదర్శులు, సమాచార పౌర సంబంధాలశాఖ కమిషనర్ విజయకుమార్‌తో కలిసి పలు ప్రధాన అంశాలపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. తిరుపతి జిల్లా నుంచి జేసీ శుభం భన్సల్, డీఆర్‌ఓ పెంచల కిషోర్ సంబంధిత అధికారులతో కలిసి హాజరయ్యారు. రెవెన్యూ అంశాలపై, జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2, పౌర సరఫరాలపై, జర్నలిస్ట్ హౌసింగ్ స్కీం తదితర అంశాలపై సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ప్రధానంగా జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2లో వలంటీర్ల మార్గదర్శకాల మేరకు కనీసం రెండు సార్లు ఇంటింటికీ తిరిగి ప్రజలకు సమాచారం తెలియజేయాలని చెప్పారు. ఆరోగ్యశ్రీ కింద చికిత్స మొత్తాన్ని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంపుదల చేసిన అంశంపై ప్రచారం చేయాలని సూచించారు. అనంతరం పౌర సరఫరాల శాఖ పనితీరుపై సమీక్షించి పలు సూచనలు చేశారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ శ్రీహరి, డా.తేజేశ్వరి, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాలకొండయ్య, కలెక్టరేట్ ఏఓ జయరాములు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్



నిందితులతో పోలీసు అధికారులు, సిబ్బంది

కలువాయి: కలువాయి మండలం, కుల్లూరులో గత డిసెంబర్ 31వ తేదీ జరిగిన చోరీ కేసును స్థానిక పోలీసులు ఛేదించారు. కలువాయి స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాపూరు సీఐ సుబ్రహ్మణ్యం ఆ వివరాలు వెల్లడించారు. కుల్లూరు దళితవాడకు చెందిన పెంచలయ్య హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడని, తన కుమార్తె కాన్పు సమయంలో స్వగ్రామమైన కుల్లూరు వచ్చారన్నారు. కుటుంబ సభ్యులంతా హాస్పిటల్‌కు వెళ్లగా ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు తాళాలు పగులగొట్టి బీరువాలో దాచి ఉంచిన బంగారు, నగదును చోరీ చేశారని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు అనుమానితులైన చింతలపల్లి పెంచలయ్య(నాని), నిప్పట్ల రవి, బొజ్జల సుధాకర్‌ని పిలిచి విచారించగా.. అసలు విషయం బయటపడిందన్నారు. వీరు గతంలో చిన్నచిన్న దొంగతనాలు చేసేవారని వివరించారు. వారి వద్ద నుంచి 10 సవర్ల బంగారు, కొంత నగదును స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. నిందితులను సోమవారం కోర్టులో హాజరు పరిచినట్టు వివరించారు. కేసును ఛేదించిన కలువాయి ఎస్‌ఐ అయ్యప్ప, సిబ్బందిని నెల్లూరు జిల్లా ఎస్పీ తిరుమలేశ్వర్ రెడ్డి, ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డి అభినందించారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

తిరుపతి కల్చరల్: హత్య కేసులో తమిళనాడు జిల్లా గుడియాతంకు చెందిన బీ.భాస్కర్‌కు జీవిత ఖైదు, రూ.1000 జరిమానా విధిస్తూ తిరుపతి పదో అదనపు జిల్లా జడ్జి రామచంద్రుడు సోమవారం తీర్పు చెప్పారు. కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోటేశ్వర్‌రెడ్డి, మానిటరింగ్ అధికారి ఈశ్వరయ్య కథనం.. తమిళనాడు రాష్ట్రం, తిరువణ్ణామలై జిల్లా, ఆరని తాలూకా, కన్న మంగళంకు చెందిన కె.శరవణన్ నిందితుడు భాస్కర్‌లు తిరుమలలో ఎటువంటి పనులు చేయకుండా వివిధ ప్రదేశాల్లో ఆహారం తీసుకుంటూ వేర్వేరు చోట్ల నిద్రిస్తూ జులాయిగా తిరిగేవారు. నిందితుడు భాస్కర్ తిరుమలలోని సీనియర్ సిటిజన్స్‌కు శ్రీవారి దర్శనానికి టోకెన్లు ఇచ్చే పాత షెడ్డు వద్ద నిద్రించేవాడు. అదేచోట శరవణన్ నిద్రించడానికి వచ్చేవాడు. దీంతో ఇద్దరి మధ్య తరుచూ తగవులు జరుగుతుండేవి. 2022, జూలై 20వ తేదీ సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీనిపై కక్ష పెంచుకున్న భాస్కర్ ఓ పెద్ద సిమెంట్ ఇటుకను అతని తలపై వేసి అక్కడి నుంచి పరారయ్యాడు. కొంతసేపటి తర్వాత చుట్టు పక్కల ప్రజలు శరవణన్‌ను అశ్విని ఆస్పత్రికి, ఆ తర్వాత రుయా ఆస్పత్రికి తరలించారు. తిరుమల వీఆర్‌ఏ సురేష్‌బాబు ఫిర్యాదు మేరకు తిరుమల వన్‌టౌన్ సీఐ జగన్మోహన్ రెడ్డి కేసు దర్యాప్తు చేసి నిందితుడు భాస్కర్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. నేరం భాస్కర్‌పై రుజువు కావడంతో న్యాయమూర్తి అతనికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

కోడిపందెం రాయుళ్ల అరెస్ట్



కోడి పందెం రాయుళ్లను అరెస్టు చూపుతున్న ఎస్‌ఐ నాగార్జునరెడ్డి

వరదయ్యపాళెం: మండలంలోని బత్తలవల్లంలో కోడి పందెం ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు బత్తలవల్లంలో దాడులు నిర్వహించి నలుగురి వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న కోళ్లు, రూ.1,030 నగదు సీజ్ చేసినట్టు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ వెల్లడించారు. ఈ దాడుల్లో ఏఎస్‌ఐ షణ్ముగం, కానిస్టేబుళ్ల హరి, కిరణ్, సుదీర్‌రెడ్డి పాల్గొన్నారు.



అయోధ్య ఆహ్వానం

అయోధ్య రామమందిర ప్రారంభోత్సవానికి టీటీడీ చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి ఆహ్వానం అందింది. సోమవారం రామమందిరం ప్రతినిధులు టీటీడీ చైర్మన్ భూమన నివాసానికి వచ్చి ఆహ్వాన పత్రికను అందించారు. ఈనెల 22న రామమందిర ప్రారంభోత్సవానికి విచ్చేయాలని సూచించారు.

– తిరుపతి మంగళం

టీటీడీ చైర్మన్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న రామమందిరం ప్రతినిధులు

తిరుమలలో వృద్ధురాలి మృతి

తిరుమల: తిరుమలలోని భయంకర్ మఠంలో ఓ వృద్ధురాలు మృతిచెందిన సంఘటన సోమవారం వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే.. రాజస్థాన్, జైపూర్‌కు చెందిన ప్రేమ్‌కాంత మేతీ(71) శ్రీవారి దర్శనార్థం కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు చేరుకుని స్థానిక భయంకర్ మఠంలో వసతి గదిని పొందారు. ఉదయం కుటుంబ సభ్యులు ఆమెను లేపేందుకు ప్రయత్నించగా లేవలేదు. దీంతో ఆమెను టీటీడీ అశ్విని ఆస్పత్రికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. మృతదేహాన్ని ఆమె స్వస్థలానికి తరలించేందుకు టీటీడీ ఏర్పాట్లు చేపట్టింది. వృద్ధురాలి మృతిపై పోలీసులు విచారణ చేపట్టి సాధారణ మృతిగానే నిర్ధారించారు.